క్లుప్తంగా...

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

ఘట్‌కేసర్: అంకుశాపూర్ సబ్‌స్టేషన్ 33/11 కేవీ ఎన్‌ఎఫ్‌సీ నగర్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాకు శనివారం అంతరాయం కలుగుతుందని ఏఈ సతీశ్ కుమార్ పేర్కొన్నారు. ఎన్‌ఎఫ్‌సీనగర్ సమీప ప్రాంతాల్లో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తూ..

కీసర: అంకిరెడ్డిపల్లి చౌరస్తాలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి సింగారం నారాయణ ఆధ్వర్యంలో ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శుక్రవారం అంకిరెడ్డిపల్లిలోని మలయాళ స్వామి ఆశ్రమం సత్యప్రభునంద స్వామి ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కొల్కూరి మహేష్, మాజీ సర్పంచ్ సత్యనారాయణ, నేలు బాల్‌నర్సింహ, లింగేశ్వర్, ఇస్తారి, శ్రీశైలం, బాల్‌రాజ్, సురేష్, దాసు, బాలిఇస్తారి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వార్షికోత్సవం



మాట్లాడుతున్న జేఎన్‌టీయూహెచ్ వైస్ చాన్స్‌లర్ నర్సింహారెడ్డి

మేడ్చల్: మున్సిపాలిటీ పరిధిలోని కిష్టాపూర్‌లో గల మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో 15వ వార్షికోత్సవాన్ని నిర్వాణ 2కె23 పేరుతో ఘనంగా నిర్వహించారు. జేఎన్‌టీయూహెచ్ వైస్ చాన్సలర్ నర్సింహారెడ్డి హాజరై ప్రసంగించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. హైకోర్టు సీనియర్ న్యాయవాది రామకృష్ణారెడ్డి, కళాశాల చైర్మన్ వేముల మల్లారెడ్డి, సెక్రటరీ వేములు కృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ సుధాకర్ రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, భరతసింహారెడ్డి పాల్గొన్నారు.

నకిలీ పట్టాదార్ పాస్ బుక్కులు సృష్టించిన వారికి రిమాండ్

ఘట్‌కేసర్: నకిలీ పట్టాదార్ పాస్ బుక్కులు సృష్టించిన వారిపై ఘట్‌కేసర్ పీఎస్‌లో కేసు నమోదైంది. సీఐ అశోక్‌రెడ్డి వివరాలు ఇలా ఉన్నాయి. మలక్‌పేట్ హైదరాబాద్‌కు చెందిన గుర్రంగారి మనోహర్‌రెడ్డికి(68) సర్వే నంబర్ 158/బి/పార్ట్/ఆ లో పట్టాదారు పాస్‌బుక్ నంబర్ 672తో 2.04 ఎకరాల భూమి ఉంది. రెండేళ్లుగా అక్కడ పిట్టల ప్రభాకర్‌ను సూపర్‌వైజర్‌గా నియమించాడు. ఏప్రిల్ 4న చాకలి నర్సింహులు అనే వ్యక్తి వచ్చి భూమిని కొనుగోలు చేస్తున్నట్లు తెలపగా సూపర్‌వైజర్ భూయజమానికి సమాచారం ఇచ్చాడు. వెంటనే అక్కడికి చేరుకున్న మనోహర్‌రెడ్డి పట్టాదార్ పాస్ బుక్కును పరిశీలించగా నకిలీగా తేలింది. మనోహర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేయగా మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం పెద్దచింతకుంటకు చెందిన చాకలి నర్సింహులు(29) గ్రామంలో స్నేహితుల వద్ద గొప్పలు చూపుకోవడానికి తన పేరుతో నకిలీ పట్టాదారు పాస్ బుక్కులు సృష్టించి ధనవంతుడిగా చలామణి అవుతున్నాడు. భూమి విక్రయిస్తున్నట్లు మనోహర్‌రెడ్డి ఇంటర్‌నెట్‌లో పెట్టగా ఉసిరికపల్లి శ్రీకాంత్(33) షాప్‌నకు వెళ్లి మనోహర్‌రెడ్డి స్థానంలో పట్టాదార్ పాస్‌బుక్కులో పేరు మార్పించి జిరాక్స్‌లు తీసుకున్నాడు. నకిలీ పట్టాదార్ పాస్‌బుక్కులు సృష్టించిన ఇద్దరు నిందితులను ఘట్‌కేసర్ పోలీసులు శుక్రవారం రిమాండ్‌కు తరలించారు.


వ్యక్తి అదృశ్యం



వంశీకుమార్ (ఫైల్)

జవహర్‌నగర్: వ్యక్తి అదృశ్యమైన ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సీతారాం వివరాల ప్రకారం.. నాయకంటి వంశీకుమార్(23), భార్య ఆమనితో కలిసి గబ్బిలాలపేటలో నివసిస్తున్నాడు. వీరికి ఒక కుమార్తె. వంశీకుమార్ స్విగ్గీ డెలివరీ బాయ్. కొంతకాలంగా ఓ మహిళతో సన్నిహితంగా ఉంటూ భార్యను సరిగ్గా చూసుకోవడం లేదు. 13వ తేదీన వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో మహిళ



రాధిక (ఫైల్)

జవహర్‌నగర్ శ్రీరామ్‌నగర్ కాలనీకి చెందిన శ్రీరాములు, భార్య రాధిక ఇద్దరు కుమార్తెలతో కలిసి నివసిస్తున్నారు. శుక్రవారం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగిరాలేదు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



రాంపల్లిలో..



మేడ్చల్‌లో నివాళులర్పిస్తున్న నేతలు



టీఎన్జీవోస్ జిల్లా సొసైటీ భవన ఆవరణంలో..

రాజ్యాంగ నిర్మాతకు.. జన నీరాజనం

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహాలకు పెద్దఎత్తున పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఒకటి రెండ్రోజుల ముందుగానే చౌరస్తాల్లో అంబేడ్కర్ విగ్రహాల వద్ద పూలతో అలంకరించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, కాలనీల సంఘాల వారు అధిక సంఖ్యలో హాజరై నివాళులర్పించారు. మహనీయుడి సేవలను కొనియాడారు. ఆయన చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలన్నారు.



గోధుమకుంటలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి మల్లారెడ్డి



అంకుశాపూర్‌లో మంత్రి మల్లారెడ్డి, సర్పంచ్ జలజ తదితరులు



ఘట్‌కేసర్‌లో నివాళులర్పిస్తున్న చైర్ పర్సన్ పావనియాదవ్, ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి



మేడ్చల్‌లోని అంబేడ్కర్ భవన్‌లో రక్తదానం చేస్తున్న యువకులు



శామీర్‌పేట్‌లో అంబేడ్కర్ జయంతి వేడుకల్లో టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి



ఘట్‌కేసర్‌లో అన్నదానం ప్రారంభిస్తున్న జెడ్పీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ హరివర్ధన్‌రెడ్డి



పూడూర్‌లో గ్రామ సర్పంచ్ బాబుయాదవ్, దండోరా అశోక్, నాయకులు



మునీరాబాద్‌లో సర్పంచ్ గణేష్ తదితరులు



అన్నోజిగూడ ఆర్టీకేలో నివాళులర్పిస్తున్న పోచారం మున్సిపల్ చైర్మన్ కొండల్‌రెడ్డి





ఉద్దమర్రిలో అంబేడ్కర్ జయంతి వేడుకల్లో నాయకులు



కొర్రెముల్‌లో సర్పంచ్ వెంకటేశ్ గౌడ్, ఉప సర్పంచ్ రాజు



కీసర ఎంపీడీవో కార్యాలయంలో..

కమిషనర్ సురేష్‌కు దళిత రత్న అవార్డు



పోచారం: రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాల సందర్భంగా సామాజిక సేవ, షెడ్యూల్డ్ కులాల అభ్యున్నతికి విశిష్ట కృషి చేసిన ప్రముఖులను గుర్తించి ఉత్సవ కమిటీ ఘనంగా సత్కరించింది. ఇందులో భాగంగా పోచారం మున్సిపల్ కమిషనర్ ఎ.సురేష్‌కు దళితరత్న అవార్డును ఉత్సవ కమిటీ వర్కింగ్ చైర్మన్ మేడి పాపయ్య అందజేశారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత సురేష్ మాట్లాడుతూ.. ఈ గుర్తింపుతో తన బాధ్యత మరింత పెరిగిందన్నారు. అవార్డు అందకోవడం పట్ల సంతోషం వ్యక్తం చేయడంతో పాటు ఉత్సవ కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాస్ మాల, రాజు వస్తాద్, ఆల్ ఇండియా షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సంస్థ అధ్యక్షుడు సుదర్శన్, ప్రముఖ ప్రజాప్రతినిధి విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా చీర్యాల లక్ష్మీనృసింహ స్వామి బ్రహ్మోత్సవాలు

- కనులపండువగా గ్రామోత్సవం
- ప్రత్యేక పూజలతో అలరించిన ఉత్సవాలు



పూజలు నిర్వహిస్తున్న పండితులు

కీసర: భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతున్న శ్రీ చీర్యాల లక్ష్మీనృసింహ స్వామి పంచదశ (15వ) వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం నిత్య పూజల అనంతరం స్వామివారికి ఉత్సవ ప్రారంభ స్నపనం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారి గ్రామోత్సవం(ఊరేగింపు సేవ)లో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. ఆలయ చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ నివాసం నుంచి గ్రామ పుర వీధుల మీదుగా ప్రధాన దేవాలయం వరకు స్వామివారి ఉత్సవమూర్తుల ఊరేగింపు కనులపండువగా కొనసాగింది. గ్రామోత్సవం సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఆలయ చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ, ఎంపీపీ ఇందిరాలక్ష్మీనారాయణ, ధర్మకర్త శ్రీహరిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



గ్రామోత్సవంలో సాంస్కృతిక కార్యక్రమాలు

పాలిటెక్నిక్ విద్యార్థులకు అవార్డులు

మేడ్చల్: మున్సిపాలిటీ పరిధిలో గిర్మాపూర్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చడంతో పలు అవార్డులు దక్కాయి. సికింద్రాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి సృజన టెక్ ఫెస్ట్‌లో గిర్మాపూర్ కళాశాలకు చెందిన విద్యార్థికి ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ విభాగంలో అవార్డు లభించింది. కళాశాలకు చెందిన స్పందన్, అనిల్, శివాని, దీక్షిత, హరీష్‌కు ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకటరమణ, పుల్లయ్య అవార్డులను అందజేశారు.



పెరిక సంఘం జిల్లా అధ్యక్షుడిగా రమేశ్‌పెరిక



రమేశ్‌కు నియామకపత్రం అందజేస్తున్న లింగయ్య

ఘట్‌కేసర్: పెరిక సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఘట్‌కేసర్ పట్టణానికి చెందిన సోమసాని రమేశ్‌పెరిక శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పట్టణంలోని బంధన్ ఫంక్షన్ హాల్‌లో పెరిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లింగయ్య ఆధ్వర్యంలో జిల్లా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఎన్నికల కమిటీ సభ్యులు ఊషయ్య, శ్రీరామ్, దయానంద్, శ్రీనివాస్ సమక్షంలో జిల్లా కమిటీని నూతనంగా ఎన్నుకున్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా రాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా అరవింద్‌ను ఎన్నుకున్నారు. సమావేశంలో అనిత, ఆనంద్, సత్యనారాయణ, సతీశ్, మల్లేశ్, జయప్రకాశ్, మనోహర్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

గొర్రెల పంపిణీ పథకంలో నగదు బదిలీ చేయాలని వినతి



మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న గొర్రెల మేకల పెంపకం సంఘు సభ్యులు

మేడ్చల్: గొర్రెల పంపిణీ పథకంలో భాగంగా ప్రభుత్వం గొర్రెలు మేకల పెంపకందారులకు నగదు బదిలీ చేయాలని జిల్లా గొర్రెల మేకల పెంపకందారుల సంఘం సభ్యులు మంత్రి మల్లారెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. మంత్రి కార్యాలయంలో ఆయనను కలిసిన సంఘం నేతలు వినతి పత్రం అందజేశారు. పథకంలో భాగంగా ఇప్పటి వరకు జిల్లాలో 3,864మంది గొల్ల కురుమలకు 81,144 గొర్రెలను పంపిణీ చేశారని, అందులో మధ్యవర్తుల జోక్యంతో దళారీలు, అధికారులే లాభపడ్డారని అన్నారు. గొర్రెలు మేకల పంపకందారులకు లాభం చేకూరే విధంగా రెండవ విడతలో గొర్రెలకు బదులు నగదు బదిలీ చేయాలని వారు మంత్రి మల్లారెడ్డి కోరారు. కార్యక్రమంలో జిల్లా సంఘం అధ్యక్షుడు కొమురయ్య, సభ్యులు కుమార్, మల్లేష్, వెంకటేషం , సంజీవ, లింగం, పాండు, కిషోర్ పాల్గొన్నారు.

గుడి, చర్చి, మసీదుకు తాగునీటి వసతి

పోచారం: సంస్కృతి టౌన్‌షిప్‌లోని గుడి, మసీదు, చర్చికి తాగునీటి కనెక్షన్లను కౌన్సిలర్ బి.హరిప్రసాద రావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డా.బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని ఈ సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. అనంతరం టౌన్‌షిప్‌లో విధులు నిర్వర్తిస్తున్న మున్సిపల్ సిబ్బందికి పండ్లు, బ్రెడ్, సాధారణ మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టౌన్‌షిప్ అసోసియేషన్ ప్రతినిధులతో పాటు కాలనీవాసులు పాల్గొన్నారు.



తాగునీటి కనెక్షన్లను ప్రారంభిస్తున్న కౌన్సిలర్ హరిప్రసాదరావు